

# మంచుతెర

గొర్తి రవి

ఆచారి నడుస్తున్నాడు.

కాదు కాళ్ళీడుస్తున్నాడు.

రేషను షాపు ఇంకా అరమైలు దూరముంది.

పక్కనుంచి రిక్షా దూసుకపోయింది.

"ఒక్కసారి రిక్షా ఎక్కితే?" పిచ్చిగా నవ్వుకున్నాడు.

"రిక్షా ఎక్కే అర్హత లేదు, తొక్కే యోగ్యత లేదు." జీవితంలో మొదటిసారిగా తనమీద తనకే అసహ్యం వేసింది.

ఇదేవిటి? తను ఇలాగ నడుస్తున్నాడు! అరె నడుం కొంచెం ఒంగిందే. చిన్నపుడు తాతయ్య నడుం ఒంగిపోయి నడుస్తుంటే, చూసి నవ్వేవాడు. ఈనాడు తనకు పట్టుమని ముప్ఫయ్యేళ్ళు లేవు, అపుడే ముసలి రూపు వచ్చేసింది.

ఇంకా నయం, అక్కడక్కడ మంచి వాళ్ళుండబట్టి నడుం ఒంగింది. లేకపోతే ఎప్పుడో విరిగుండేది అనుకున్నాడు.

రేషను షాపు వచ్చేసింది. క్యూలో నుంచున్నాడు. పెళ్ళయిన తరువాత ఒక్కసారేనా భార్యని సినిమాకి తీసికెళ్ళ గలిగేడా? పిల్లలకి మంచి తిండి, బట్ట ఇవ్వగలిగేడా? పోనీ అయిపోయిందేదో అయిపోయింది. భవిష్యత్తులో ఒక్కరోజంటే, ఒక్కరోజు తను వాళ్ళ కోరికలు తీర్చ గలడా? ఆలోచిస్తున్నాడు ఆచారి.

ఇంతలో ఉన్నట్టుండి కేకలు వినిపించాయి. ఆచారి లేచి నుంచున్నాడు. "పోలీసులు" అరిచేరెవరో. దడదడమని చెదిరేరు. దొరికిన వాడినల్లా చితక్కొట్టేరు. చేతికందినవాడినల్లా లాకి ఎక్కించేరు.




ఆచారి కంతా అయోమయంగా వుంది. సంగతేవిటని అడిగేడు పక్కవాడిని. "ఏవీ లేదండీ, ఇందాక ఒచ్చినవాళ్ళు బానిసత్వం కావాలి అంటూ అరిచేరు. చూశారుగా? పోలీసులు ఒచ్చేరు" అని చెప్పేడు.

"బానిసత్వం" ఆచారి మొహం ఆనందంతో మెరిసింది.

పుష్కలంగా తిండి బట్టా కళ్ళముందర మెదిలేయి. బానిసత్వం అన్నమాటేగానీ, వాళ్ళ జీవితం ఎంత హాయిగా ఉండేది? ఇలా ప్రతిదానికీ కరువుండేదా?అడుగడుక్కీ లంచాలు ఉండేవా? గూండాలు ఇంత విచ్చలవిడిగా తిరిగేవారా? ఇంత అవినీతి ఉండేదా? గాంధీ అసలు పుట్టకపోతే బాగుండును. చితికి నిప్పంటించి వెళ్ళేడు మహానుభావుడు. మొదటిసారిగా గాంధీ మీద కోపం వచ్చింది. స్వరాజ్యం రాకపోతే దేశం ఎంత అభివృద్ధి చెందేదో. ఛ! ఛ! గాంధీ మీదా తనకి కోపం, కాదు కాదు, ఈ గాడిదకొడుకులమీద. ఎవర్ననేం లాభం? గాంధీ మళ్ళీ పుడితేనో, అవును మళ్ళీ పుట్టి బానిసత్వం కోసం సత్యాగ్రహం చేస్తే, తను, పెళ్ళాం పిల్లలందరూ తప్పకుండా పాల్గొంటారు.

ఆచారికి వీరావేశం వచ్చేసింది: "బానిసత్వం కావాలి!" అంటూ అరిచేడు. దీనికోసమే కాచుక్కూర్చున్నట్టు పోలీసులు లాక్కెళ్ళి పోయారు.

పాపం, ఆచారి కోరిక ఫలించింది. బానిసత్వం లభించింది.

జైలు కటకటాల్ని చేతుల్తో బాదుతున్నాడు.

"అయ్యో, అయ్యో, ఏమిటండీ అది? ఉన్నదొక్కటే నులకమంచం, లెండింక. రేషను షాపు కెళ్ళాలి" అన్న కేకలతో తెలివొచ్చింది ఆచారికి.